
# కాల్దారి



-దేగా వి.ఆర్.రెడ్డి

'కాల్దారి'కి తూర్పు దిక్కున ఊడలు దిగిన మర్రిచెట్టు జడల బర్రెలా వుంది. అప్పుడేపడిన చిరుజల్లుకు తడిసిన కొంగలు గుంపుగా మర్రి కొమ్మల కొనల మీద ముడుచుక్కూర్చున్నాయి. ముదురు గట్టిన మర్రి ఊడల కుదురుకు ముడతలు పడిన ముసలి శరీరాన్ని ఆన్చి......పక్కనే ఉన్న తండ్రి సమాధి వైపు చూస్తూ ముడుచుక్కూర్చున్నాడు 'పెదమల్లురాజు'. మల్లురాజు వయసు తొంబయ్యో పడిలో పడింది. పాతకారు కళ్ళజోడులోంచి గుచ్చి చూడనిదే ఏదీ కన్పించదు. అయినా - అక్కడే కూర్చొని రైలు కట్ట వైపు చూస్తూ గతాన్ని గుర్తు చేసుకోవడం అతనికి పరవశం కలిగిస్తుంది.

పెదమల్లురాజు తండ్రి 'బలమల్లురాజు'. దాదాపు ఏనభై ఏడు సంవత్సరాల క్రితం తండ్రి వేలు పట్టుకొని ఈ కాల్దారిలోనే తప్పటడుగులు వేశాడు. మాటలు నేర్చి ఆట పాటలాడే బాల్యంలో కాల్దారి నుంచే గుర్రం ఎక్కి పొలాల వైపు వురికించి స్వారీ నేర్చుకున్నాడు.

గంతలూరు గంగరాజుతో దట్టీకట్టి ఈ మర్రి కిందనే మల్ల యుద్ధానికి పోటీ పడితే పల్లెజనం తరబడి చూశారు. తొడగొట్టి - మల్లన్న ప్రత్యర్థి గంగన్నను ఓడించి 'మల్లురాజు'గా కోర మీసం మెలి తిప్పాడు.

కర్రబట్టి కదనుతొక్కి 'రాజపురం రంగన్న'ను గింగిరాలు కొట్టించి పోటీదార్ల గుండెల్లో గంగవెర్రులెత్తించాడు. సంబరపడిన 'రంగన్న' ముచ్చటయిన చెల్లెల్ని కానుకగా ఇచ్చి వీరుడి మీసానికి మరింత వన్నె తెచ్చాడు. తన ఇంటి జంటను ఆనందంగా ఆహ్వానించి ఆశీర్వదించాడు తండ్రి 'బలమల్లురాజు'! చనిపోయే ముందు ఆయన కోరినట్లుగానే కాల్దారి పక్క ఆ మర్రిచెట్టు కిందనే ఆయన సమాధి నిర్మించాడు 'పెద్దమల్లురాజు'. చుట్టుపక్కల విశేషాలన్నీ ఆ రోజుల్లో ఆ ఊడల మర్రి నీడలోనే జరిగేవి.

ఒకరోజు ఊరి జనమంతా వచ్చి 'అయ్యగారూ! మన ఊరి మీదుగా రైళ్ళొచ్చేస్తాయంట ఎట్టాగండయ్యా?" అంటూ భయం వెలిబుచ్చారు. వాళ్ళ భయాన్ని ముందుగానే గ్రహించిన మల్లన్న ఉదార స్వభావంతో వాళ్ళకు ధైర్యం చెప్పి ఆనందంగా రైలుకట్ట పోసేందుకు తన పొలాన్ని స్వయంగా దఖలుపరిచాడు. ఆయన మంచితనానికి ఊరి జనం జేజేలు పలికారు. ఇప్పటికే కాల్దారి పక్క తండ్రి సమాధి చెంత కుదురుగట్టిన ఊడలను ఆనుకొని రైలు కట్ట మీద పట్టాలపై పరుగెట్టే రైళ్ళను చూస్తూ పరవశిస్తుంటాడు.

తన బుడ్డోడు పెద్దోడయి స్వాతంత్ర పోరాటానికి వెళ్తూ వాడి బిడ్డడు 'చంద్రా'న్ని గుండెల కత్తుకొని ముసలాయన చేతుల్లో పెట్టి వెళ్తుంటే కోడలు 'స్వరాజ్యం' బొటనవ్రేలు కోసి రక్తతిలకం దిద్దింది. స్వరాజ్యలక్ష్మినే ఊపిరిగా స్ఫూర్తినిచ్చిందే గాని - తన జీవితం, బుడ్డోడు చంద్రుడి భవిష్యత్తు - 300 ఎకరాల మాగాణం, 500 ఎకరాల పశువులు బీడు, ఒక్క వేయి జీవాల ఉనికిని ఆమె ఆలోచించలేదు. ( బిటీషోళ్ళ దాష్టికాన్ని 'పెదమల్లురాజు' మొదటి నుండీ వ్యతిరేకిస్తూనే వున్నాడు. తొడగొట్టి పడగొట్టిన రోషం గదా! కొడుకును ఆశీర్వదిస్తూ దిగ్విజయంగా వెళ్ళి రమ్మని ఆశీర్వదించాడు.

వెళ్ళిన కొడుకు ఉప్పు సత్యాగ్రహాలు చేశాడు. జైల్లో పడ్డాడు. లాఠీ దెబ్బలు తిన్నాడు. ప్రవాసం పంపబడ్డాడు. స్వతంత్రం వచ్చింది. ఖైదీలంతా విడుదలయ్యారు. దేశమంతా స్వేచ్ఛతో విజయోత్సవాల ఊపిరులు పీల్చింది. కాని, పోయిన కొడుకు మాత్రం తిరిగి రాలేదు. అయితే తన పొలంలోంచి చూడ్డం మాత్రం మానలేదు 'మల్లురాజు'.

భూ సంస్కరణల కొరకు చట్టం చేస్తున్నారని మిగులు భూములను బీదాబిక్కికి పంచనున్నారని తెలిసి సంతోషించి స్వచ్ఛందంగా బీదలకు భూములను దఖలుపరిచాడు. స్వాతంత్ర్య వీరులంతా ఈ చర్యను హర్షిస్తుంటే పోయిన కొడుకు గుర్తుకొచ్చి కుమిలిపోయాడు. మనుమడు 'రాంచంద్ర'లో కొడుకుని దర్శిస్తూ బీదాసాదాతో సహజీవనం జరిపాడు. ఒక పేదరైతుగానే!

ముసలి మల్లురాజుకు బాగా గుర్తు. రైలు కట్ట నిర్మించే రోజుల్లో సర్కారోళ్ళు మైళ్ళ దూరం నుండి 'మరుం' మన్ను తోలుకొస్తుంటే వారిని మందలించి అక్కడే వున్న తన పొలంలో పదెకరాలు కేటాయించి మన్ను తోలుకోమన్నాడు. కంకరరాళ్ళు పదిమైళ్ళ దూరం నుండి తెప్పిస్తూంటే దగ్గరలోని తన బీటి పొలంలో వుండే గుట్ట చూపించి కంకరకొట్టుకోమన్నాడు. కట్టపని జోరుగా జరిగిపోయింది. పట్టాలు అమర్చడం కూడా పూర్తి అయింది. కాని, ఒక్క పట్టా మాత్రం అమర్చవలసి వుంది. పొలానికెళ్ళిన మల్లురాజు ఆందోళనగా వున్న అధికారుల్ని ఎందుకలా వున్నారని ప్రశ్నించాడు.

"రేపే రైళ్ళు బయలుదేరుతాయనీ - ఈ స్థితిలో ఈ రోజు కూలీలు రాకపోవడంతో పట్టా అమర్చలేకపోతున్నామనీ వివరించారు.

నోట్లో వున్న మొహం పుల్లను తీసి పల్లె వేపు తిరిగి ఒక్క పొలికేక పెట్టాడు. పల్లె జనం పరవళ్ళు తొక్కుతూ పరుగెట్టుకొచ్చింది. పట్టా కట్ట మీది కెక్కించే పనికి పురమాయించాడు. కాని, అందరు పట్టినా పట్టా కదల్లేదు. అధికార్లు నిస్సహాయంగా చూస్తున్నారు. మొహం పుల్ల పడేసి కండువా నడుంకు బిగించాడు. నాటి రంగరాజును, గంగరాజును గిరికీలు కొట్టించిన అతడి పిడికిళ్ళు బిగుసుకున్నాయి. 'హైసా-రె-లెస్సా....పట్టా పట్టో' అంటూ దద్దరించే గొంతెత్తి బలంపెట్టి జనం బలంతో ముంచెత్తాడు. పట్టా దెబ్బమ్మటి కట్ట మీదకు వచ్చింది. అధికార్లు లింకులు బిగించుకున్నారు. అందరూ పెద్దమల్లరాజుకు జేజేలు పలికారు. పట్టాకింద నలిగిన అతడి చేతి నెత్తుటి మరక పట్టా మీద చెక్కిన ఇంగ్లీషు అక్షరాలను తడిపింది. ఈ రోజుకీ అతడు పొలం వెళ్ళి ప్రతి రోజూ పట్టా మీది ఆ అక్షరాలను చూచి గతం గుర్తు చేసుకోవడం దినచర్యగా మారిపోయింది. తను నిలిపిన రైలు పట్టాగా గుండెల్లో గుర్తుండిపోయింది. అందుకే మనవడు 'చంద్రం' ఒక రోజు అడిగితే ఈ విషయమే చెప్పి గత స్మృతులతో ఆనందించాడు.

"ఇదంతా గతంలో మన పొలంరా. ఇప్పుడు, ఎంతో మందికి బలంరా. రైలు కట్ట...ఈ పట్టా మీద ఇంగ్లీషు అక్షరాలు అప్పుడు నా చేతి రక్తంతో తడిచాయిరా. ఈ ముడతలు పడిన చేతులే బాబూ ఆ రోజు ఈ పట్టాను కట్టమీద నిలిపింది. ఆ జ్ఞాపకాలు రోజూ నన్ను శక్తినిచ్చి పొలంవైపు నడిపిస్తాయి 'చంద్రం' ! " అంటూ ఆనందించేవాడు.

మర్రిచెట్టు మీది గుడ్లగూబ అరిచింది. కొమ్మకొనల మీద ముడుచుకొన్న కొంగలు రెక్కలు టపటపలాడించాయి. ఈదురుగాలికి ఎండు కొమ్మ విరిగి పడింది. మర్రినీడలో తండ్రి సమాధి చెంత ముడుచుకు కూర్చున్న తొంబదేండ్ల మనసు పసిగట్టింది. గుండెకళ్ళతో చూస్తూ, దండి చెవులు రిక్కించింది.

కాల్దారి నుండి జనం నడుస్తున్నారు. అరుస్తున్నారు. రైలు కట్టమీద అక్కడే తను నిలిపిన రైలు పట్టా దగ్గర జనం గుంపులు గుంపులుగా వున్నారు. రైలు ఆగిపోయి వుంది. ఏమైంది? ముసలి మనసు గందరగోళంగా వుంది. కాల్దారిలో గగ్గోలు రేగింది. అలజడి చెవుల పడుతోంది. కళ్ళకు అందని బీభత్సాన్ని అతడి ముసలి ముడతల మనసు గ్రహిస్తోంది.

"బాబూ! ఏంటక్కడ? ఏమైంది?"

వణికే గొంతుతో తడబడే అడుగులు వేస్తున్నాడు. జనం పరుగులు తీస్తున్నారు. పచ్చని పంట పొలాల్లో ఎర్రని నెత్తురోడ్చుతూ జనం పరుగులు తీస్తున్నారు.

'నీటి తీరువా పెంపు నిర్ణయం విరమించుకోవాలి!' అనే నినాదాలు మిన్నంటుతున్నాయి. మరో వైపు నుండి తుపాకి గుళ్ళ శబ్దాలు వినిపిస్తున్నాయి. చెల్లా చెదురవుతున్న జనం అస్పష్టంగా కనిపిస్తున్నారు. కాల్పులు -'ఫైరింగ్! పోలీస్ ఫైరింగ్!!' అంటూ గాయాల నెత్తురుతో జనం పారిపోతున్నారు.

కాల్దారికి ఇరువైపుల పంట పైరు చిందర వందరయింది. గుండు దెబ్బలు తిన్న గుండె రక్తం పాదుల్లోని పైరు గుంటల్ని చుట్టుకొంటోంది. మల్లతాత పొలం గుండె గొంతులో కొచ్చింది. నిలువు కాళ్ళ కర్ర బలంతో కళ్ళు చీల్చుకుంటూ ముందుకు నడిచాడు. రైలు కట్ట మీద -అక్కడే తను నిలిపిన పట్టా ...తనకు బాగా గుర్తు, కళ్ళు మూసుకోనైనా ఆ పట్టాను గుర్తించగలడు. అతడి చేతి రక్తంతో అభిషిక్తమైనదది. సరిగ్గా అదే... ఆ పట్టా మీదనే రక్తం... చిక్కగా ఎర్రగా కంకర రాళ్ళలోకి జారి కిందనున్న మన్నులోకి 'ఇంకి'పోతోంది.

అక్కడే, అప్పుడే ఊపిరాడిన 'రాంచంద్ర'...మనమడు చందు... ఇంతకాలం అతడి కండల మీద నడిచిన రైళ్ళు ఈ రోజు గుండెల మీద గుండ్లు దింపాయి.

"బాబూ చందూ!" పొలికేక పెట్టాడు మల్లురాజు

భయపడ్డ పిల్లకాకి రెట్ట రాల్చింది.

కన్నబిడ్డను పోగొట్టిన స్వతంత్రం...భూమిని బడుగుల కిప్పించిన స్వతంత్రం...ప్రకృతిని పన్నులు కట్టమన్న స్వతంత్రం...తీరువా రూపంలో తీరిగ్గా రక్తం చిందిస్తున్న స్వతంత్రం -

నెత్తురోడే రైతు స్వతంత్రం...?

మర్రి నీడలో కాల్దారి పక్కనే మరో సమాధి!

చరిత్ర ప్రశ్నిస్తోంది ప్రజాస్వామ్యాన్ని?

ఫ్యూడలిజం సమాధి కాలేదు. సమాధుల్లో వుండే ఎముకల గూళ్ళకు తీరువా విధించినా...!

కాలగతి 'కాల్దారి' పక్క ముసలి వగ్గు మల్లురాజు కళ్ళలో నెత్తురు బొట్లు రాల్చింది.



## అమ్మంటే అంతులేని సొమ్మురా!

అమ్మంటే చైతన్యానికి చిహ్నం. అమ్మ అనురాగానికి ప్రతీక. అమ్మలు లేని ప్రపంచాన్ని ఊహించుకోండి. అలాంటి ప్రపంచం నిస్సారంగా వుంటుంది. అమ్మ ఒక చల్లని సమీరం.అమ్మ ఒక్క రోజు సెలవు తీసుకుంటే తెలుస్తుంది అమ్మ అవసరం. మన చేతులు, కాళ్ళు ఆడవు. ఏ పనీ స్వంతంగా చేసుకోలేము. ఎప్పుడో పెళ్ళి కాక ముందు స్వతంత్రంగా, హాయిగా తిరిగిన అమ్మ పెళ్ళికావడంతో బాధ్యతల వలలో పడిపోతుంది. అందరి మంచితనాన్ని పొందదానికి, కొత్త కుటుంబ సభ్యుల దృష్టిలో మంచి కోడలు అనిపించుకోడానికి... ఇంకా చెప్పాలంటే తలలో నాలుకలాంటి మనిషి అనిపించుకోడానికి అమ్మ కుటుంబ సభ్యుల పనులన్నింటినీ నెత్తికెత్తుకుంటుంది. ఆ విధంగా మొదలయ్యే పనులతో అమ్మ ఆఖరికి ప్రపంచ శ్రామిక మహిళకు ప్రతిరూపంగా నిలిచిపోతుంది. అమ్మ చేసే శ్రమకు లెక్కకట్టే షరాబు ఎవరూ ఈ ప్రపంచంలో వుండడు. అమ్మ నిజంగా విశ్రాంతి తీసుకుంటోందా? అమ్మ సంతోషంగా వుంటోందా? మనవేం చేస్తే అమ్మ నిజమైన ఆనందాన్ని పొందుతుంది? ... ఇలాంటి ప్రశ్నల్ని కుటుంబ సభ్యులు తమలో తాము వేసుకుంటే అమ్మ గుండె నిండా ఊపిరి పీల్చుకోగలుగుతుంది!

* * *

సరోజమ్మకు ముగ్గురు పిల్లలు. ఆమె భర్త ఓ ప్రభుత్వ ఆఫీసులో క్లర్క్. పెళ్ళయిన తర్వాత అయిదు సంవత్సరాల్లోనే ముగ్గురు పిల్లలు పుట్టారు. ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల. పిల్లల కోసం సరోజమ్మ తను చేస్తున్న ప్రైవేటు ఉద్యోగానికి రాజీనామా చేసింది. కానీ పిల్లల పెంపకంలో ఎక్కడా రాజీ పడలేదు. "సరోజమ్మ పిల్లలకేమి ఆణిముత్యాలు", "పిల్లల్నెలా పెంచాలనేది సరోజమ్మను చూసే నేర్చుకోవాలి"... ఇలాంటి ప్రశంసలు అప్పుడప్పుడు సరోజమ్మకు గర్వాన్ని చ్చేవి. ఆడపిల్ల పెళ్ళి కాగానే ఇద్దరు మగపిల్లలు కూడా త్వర త్వరగా పెళ్లిళ్ల చేసుకొని ఉద్యోగరీత్యా వేర్వేరు ఊళ్ళల్లో కాపురాలు పెట్టేరు. చిన్నవాడి పెళ్ళయిన వారం రోజులకు సరోజమ్మ మొట్టమొదటిసారిగా తన గురించి తీవ్రంగా ఆలోచించడం మొదలు పెట్టింది. జోగాడే పిల్లలు స్కూలుకు వెళ్ళే పిల్లలయ్యారు. కొత్త బాధ్యతలు. ఆ తర్వాత వారు కాలేజీలకు వెళ్ళే పిల్లలయ్యారు. మరిన్ని బాధ్యతలు. పిల్లలకు ఉద్యోగాలొచ్చాయి. పెళ్ళిల్లయ్యాయి. ఒక విధంగా చెప్పాలంటే ఎవరి జీవితాల్లో వారు దూరిపోయారు. కానీ దీని వెనుక వున్న సరోజమ్మ నిర్విరామ కృషిని మాత్రం ఆమె పిల్లలు గుర్తించ లేదు. కొత్తగా ప్రారంభమైన తమ కుటుంబాల్లో అమ్మకొక సాన్నిహిత్యాన్ని కలిగిద్దామనే స్పృహ వారికి లేకపోయింది. పెళ్ళి కొరకు అమ్మమ్మ చేయించిన నగల్ని తమ చదువులకొరకు అమ్మ అమ్మేసిందనే విషయం తెలిసినా తమ జీవితాల్లో మంచిగా స్థిర పడిపోయిన తర్వాత కూడా ఆమె పిల్లలు ఆ విషయం గురించి ఆలోచించలేదు. బోసిగా వుండే తన మెడ గురించి ఆమె ఏనాడు ఆలోచించలేదు. కానీ పిల్లల్లేక బోసిపోయిన ఇంటిని చూసి ఆమె తనలో తానే దు:ఖించింది. ఆమె పిల్లలు పండుగలకు, పబ్బాలకు సుడిగాలిలా వస్తారు. అంతే వేగంగా వెళ్ళిపోతారు. సరోజమ్మ ఆరోగ్యం గురించి, తల్లితండ్రుల వంటరితనాన్ని గురించి అడిగే సాహసం చేయరు.'సూపర్ మామ్ సింద్రోమ్' (గొప్ప అమ్మగా అనిపించుకోవాలనే వ్యాధి)తో ప్రతీ క్షణాన్ని పిల్లలకొరకు ఖర్చు పెట్టిన సరోజమ్మ కొరకు సంవత్సరంలో కొన్ని రోజుల్ని కూడా ఖర్చు పెట్టే వారే కరువైపోయారు.

* * *

ఎప్పుడూ తీరిక లేని పనుల్లో మునిగిపోయి వున్నట్టు నటించకుండా, వంట గదిలోని అమ్మ పనుల్లో సహాయం చేస్తే అమ్మ ఓ చిరునవ్వు నవ్వుతుంది. ఆ నవ్వు విలువ కట్టలేనిది. ఎప్పుడో మరిచి పోయిన ఆమె పుట్టిన రోజును జ్ఞప్తికి తెస్తూ హఠాత్తుగా అమ్మకొక బహుమతిని తెచ్చిస్తే 'నేను పట్టించుకునే వాళ్లే కాదు. నన్ను పట్టించుకునే వాళ్ళు కూడా వున్నార'ని అమ్మకొండంతగా సంబరపడిపోతుంది. ఆ సంతోషాన్ని చూసే అదృష్టం మనకు మరే చోట లభించదు.

-సి.వనజారెడ్డి